క్లుప్తంగా

ఘనంగా సుదర్శన హోమం



బలుసుతిప్పలో సుదర్శన హోమం

కాట్రేనికోన: బలుసుతిప్ప గ్రామంలో మల్లాడి వీర్రాజు దంపతులు నిర్మించిన అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తికమాసం ప్రారంభం నుంచి ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు ఫణి ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు స్వామి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో సోమవారం మల్లాడి వీర్రాజు, మల్లాడి రాజేష్ దంపతులు గణపతి పూజ, నవగ్రహ మంటపారాధన, సుదర్శన హోమం ఘనంగా చేయించారు. ప్రసాద వితరణ చేశారు.

75 ఎన్‌డీపీ మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: పాండిచ్చేరి యానాం నుంచి అక్రమంగా తెచ్చిన నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) 75 మద్యం సీసాలు అమ్మేందుకు ఉంచిన నేరంపై అమలాపురం మండలం పేరూరుకు చెందిన కర్నోల నాగభూషణాన్ని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కుప్పాల రామకృష్ణ నుంచి ఆరు ఆంధ్ర మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబుతో పాటు ఎస్‌ఈబీ ఎస్ఐ సీహెచ్ స్వామిరెడ్డి సంయుక్తంగా ఈ దాడులు చేసినట్లు సీఐ శివరామరాజు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. ఈ దాడుల్లో సీఐలు, ఎస్సైతోపాటు ఎస్‌ఈబీ హెడ్ కానిస్టేబుల్ ఏవీఎస్ఆర్ రాజు, కానిస్టేబుల్ ఎం.నూతన ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో దాడులు చేసినట్లు సీఐ శివరామరాజు తెలిపారు.

పథకాలపై అవగాహన



లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేస్తున్న నోడల్ ఆఫీసర్ రాంబాబు తదితరులు

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం మండలంలో గేదెల్లంక, ఠానేల్లంక గ్రామాలలో సర్పంచ్‌లు సానబోయిన పల్లయ్య, నక్కా విజయరాణి అధ్యక్షతన అవగాహన సదస్సులు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 14 పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరించారు. ఆయా పథకాలపై డాక్యుమెంటరీ, పీఎం నరేంద్రమోదీ ప్రసంగం వినిపించారు. అనంతరం లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ జే.రాంబాబు, కోలా బాబ్జీ, జగతా పద్మనాభం, జేవీవీ సత్యనారాయణ, ఎంఈఓ ఆర్.ఉదయ భాస్కరరావు, డాక్టర్ రాహుల్, ఏఓ ఎస్.ప్రశాంతకుమార్, ప్రోగామ్ ఆఫీసర్ కేబీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు భీకన్న మృతి



భీకన్న మృతికి సంతాపం తెలుపుతున్న మంత్రి విశ్వరూప్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పారి భీకన్న (63) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. స్థానిక 22వ వార్డు శివారులో గల భీకన్న ఇంటికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పార్టీ నాయకులు సోమవారం ఉదయం వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీకన్న భార్య వెంకటలక్ష్మి అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా పనిచేశారు. భీకన్నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

సుబ్రహ్మణ్య భారతి జయంతి

యానాం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, సంఘ సంస్కర్త సుబ్రహ్మణ్యభారతియార్ జయంతిని సోమవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సీఐ షణ్ముగం, పీఆర్ఏ కొల్లు ప్రసాద్, పీడబ్ల్యూడీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు కార్తిక దీపారాధన ముగింపు

యానాం: కనకాలపేటలో కొలువైన శ్రీకోదండ రామ, పోలేరమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో 46వ కార్తిక దీపారాధన మహోత్సవాలు గత నెల 14న ప్రారంభమై మంగళవారంతో ముగుస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. యాళ్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మేలుకొలుపు, పురాణ పఠనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శివోహం



కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

- మార్మోగిన శివనామ స్మరణ
- ఆలయాల్లో కిక్కిరిసిన జనాలు

ఐ.పోలవరం: కార్తికమాసం నాలుగో సోమవారం శివ నామస్మరణతో మండలాలలోని ఆలయాలు మార్మోగాయి. మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. స్థానిక గౌతమి గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి కార్తిక దీపాలను గోదావరిలో వదిలారు. పలువురు భక్తులు గోపూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఆలయంలో తొలి పంచామృత అభిషేకాలు 283జరగగా, 456 లఘున్యాస అభిషేకాలు జరిగాయి. పలువురు మహిళలు ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచ హారతుల దగ్గర, ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. వీరేశ్వరస్వామి ఆలయంలో విద్యార్థులు, యువకులు, మహిళా భక్తులు 108 ప్రదక్షిణలు చేశారు. సుమారు 15వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు దాతలు నలమాటి అవినాష్ చౌదరి, జితేష్ చౌదరి ఆర్థిక సహాయంతో అన్నప్రసాద వితరణ జరిగింది. మండలంలో కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, గుత్తినదీవి, ఎదుర్లంక, గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు వేకువజామున లేచి భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు.

ముమ్మిడివరం: స్థానిక ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతి గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వర స్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేల్లంక ఉమాసోమేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వేకువ జామునుంచే గోదావరిలో స్నానాలాచరించి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన: పార్వతీ సమేత కుండలేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునే భక్తులు కుండలేశ్వరం రేవులో స్నానం ఆచరించి రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. అనంతరం పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాసం ప్రారంభం నుంచి ప్రతి రోజు స్వామిని రకరకాల పుష్పాలు, బిల్వ దళాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సుమారు 200 జంటలు కర్తలుగా పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అర్చకులు కాళ్ళకూరి కామేశ్వర శర్మ మాట్లాడుతూ కాశీ వంటి పుణ్య క్షేత్రాలను దర్శించుకునే భక్తులు ముందుగా కుండలేశ్వరస్వామి దర్శనం చేసుకోవాలని ప్రముక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు వంటి ప్రముకులు అనేక సందర్భాలలో చెప్పాన్నారన్నారు. ఈఓ గంగాధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమలాపురం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: పవిత్ర కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో పట్టణంలోని నాలుగు ప్రధాన శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. స్థానిక పురాతన శివ క్షేత్రమైన చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ భక్తుల తాకిడి కనిపించింది. ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి, ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్థానిక సర్వ మంగళ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అనువంశిక చైర్మన్ మాచిరాజు రవికుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. స్థానిక సిద్ధేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో కూడా భక్తులు పోటెత్తారు.

అల్లవరం: దేవగుప్తంలోని ఉమా సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యువత ఆధ్వర్యంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు పాలు, ప్రసాదాలు అందించారు. ఎస్.రామేశ్వరంలో కొలువైయున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మణేశ్వరంలోని వేంచేసియున్న పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. బోడసకుర్రులో గౌతమేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంట్రుకోన, కొమరగిరిపట్నం, అల్లవరం, బెండమూర్లంక, గూడాల, తాడికోన గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు.

తాళ్లరేవు: స్థానిక శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్ష, సామూహిక లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి శివరామకృష్ణ, వేద పండితులు వేలూరి కాశిబాబు, మర్ల ఫణిశర్మ, కామేశ్వర శర్మ తదితరుల పర్యవేక్షణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.



ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి




ఎస్.రామేశ్వరంలో కొలువైయున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి



మురమళ్ల వీరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా జ్యోతిర్లింగార్చన




దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన– నల్ల వంతెన మధ్య గల శ్రీదక్షిణామూర్తి శక్తి స్థల్‌లో శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దివ్య జ్ఞాన జ్యోతిర్లింగార్చన వైభవంగా నిర్వహించారు. మహిళలు, అక్షయ పాత్ర, గోశాల సేవకులు, భక్తులు జ్ఞాన జ్యోతులను వెలిగించారు. ఈ జ్యోతిర్లింగార్చన కోసం చతుర్ధ శాంతి యమధర్మరాజ దివ్య జ్ఞాన పీఠాన్ని నిర్మించారు. జ్యోతిర్లింగార్చన కోసం శివలింగాన్ని కూడా ఏర్పాటు చేశారు. అక్షయ పాత్ర వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆ సంస్థ, గోశాల సేవకులు ఈ ఏర్పాట్లు చేశారు.

మనసున్న మనిషి మన సీఎం

కేశనకుర్రులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'

ఐ.పోలవరం: పేదవాడికి మంచి చేయాలనే ఆలోచన ఉన్న ముఖ్యమంత్రిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు(శ్రీనురాజు) అన్నారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు సచివాలయం వద్ద సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం పిన్నంరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన జరిగింది. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో సుమారు రూ.70 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించిన వివరాలతో సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదవాడిని చదివిస్తున్నాం, వాడు పెద్ద వాడై ఇంజినీరు, డాక్టరు అయితే ఆ ఇంటిలో పేదరికం పోతుందన్నారు. పేదలకు సొంత ఇంటిని కట్టించి ఇస్తున్నాం అన్నారు. పేదలకు వైద్యం కోసం ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతీ వారికి వైద్యం చేసే బృహత్తర కార్యక్రమం చేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి, మిరియం జ్యోతి, మెకా రవికుమార్ మాట్లాడుతూ నవరత్నాలు పేరుతో పేదలకు ఎంతో మంచి జరిగింది అంటే కేవలం ఈ ప్రభుత్వంలోనే అని అన్నారు. పి.బాబ్జిరాజు, కాశి పరివాజ్ కుమార్, ఇందుకూరి రంగరాజు, చెల్లి రమాదేవి, సుబాస్ డాక్టర్, యలమంచలి వాసు పాల్గొన్నారు.



కేశనకుర్రులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

తుపానులో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అల్లవరం: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఉపాధిహామీ పథకం ద్వారా ఆదుకోవాలని, పంటబోదెల్లో పూడికతీత పనులు చేయించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 15 నుంచి నిర్వహించే క్రీడలను విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఏఈలు స్వామి, సుబ్బారావు, ఏపీఓ శ్రీనుబాబు, వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, ఏఓ లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఏర్పాటు చేయదలచిన స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని సోమవారం ప్రతిపక్షనేత, డీఎంకే రాష్ట్ర ఆర్గనైజర్ ఆర్.శివ సీఎం రంగసామికి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు వల్ల వ్యవసాయ మోటార్లు ఉపయోగించే రైతులకు, ప్రజలకు చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. తక్షణం మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. ఈ సమస్యపై అన్ని పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

తాళ్లరేవు: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవనోపాధిలేక ఇబ్బందులు పడుతున్న ఒక కార్మికుని కుటుంబానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సహాయం అందించారు. మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం కాలనీకి చెందిన విత్తనాల వెంకటేశ్వరరావు తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి భార్య సత్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొంతకాలంగా రెండు కిడ్నీలు పనిచేయక పోవడంతో అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానిక వార్డు సభ్యుడు కడలి శ్రీను శివన్నారాయణ దృష్టికి తీసుకువెళ్లగా ఆ కుటుంబానికి రూ.10 వేలు నగదును సోమవారం అందజేశారు.



కిడ్నీ బాధితునికి నగదు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని సుంకరపాలెం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సీఎం జగన్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో మరోమారు జగన్‌ను సీఎం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సుంకరపాలెం పంచాయతీలో వివిధ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ వివరించారు. నాయకులు పలివెల రాము, గురజాపు లోవరాజు, శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేతన ఒప్పందానికి వినతి

యానాం: నియోజకవర్గ పరిధిలో రైసుమిల్లు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం చేసుకున్న ఒప్పందం డిసెంబర్ 2వ తేదీతో ముగిసిందని చెప్పారు. నూతన వేతనం ఒప్పందం అమలు చేయాలని నవంబర్ 15నే కోరినా యాజమాన్యం స్పందించకపోవడంతో లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి డిమాండ్ నోటీసును ఇచ్చినట్టు తెలిపారు. నాయకులు సలాది నాగబాబు, టి.శ్రీను, దాసరి రాజు, కొప్పిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.



లేబర్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కార్మికులు

బావిని పరిరక్షించాలని వినతి

ఉప్పలగుప్తం: విలసవిల్లిలోని ముత్యాలమ్మ–ముక్కలమ్మ ఆలయాల వద్ద ఎన్నో ఏళ్లుగా ప్రజల దాహాన్ని తీర్చుతున్న పురాతన బావిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని విలసవిల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సోమవారం ఫిర్యాదు చేశారు. బావిని పరిరక్షించాలని కలెక్టర్‌ను వార్డు మెంబర్లు జె.నాగమణి, సుబ్బలక్ష్మి, శాంతకుమారి, వీరమాత, ముషిణి లింగేశ్వరరావు కోరారు.

సీఎం జగన్ వల్లే కార్మికులకు గుర్తింపు

అమలాపురం రూరల్: ప్లంబర్లు, ఫిట్టర్, వాల్ ఆపరేటర్స్ ఎలక్ట్రీషియన్లు, వాచ్‌మెన్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్న వారికి భరోసా కల్పించి దళారీ వ్యవస్థ లేకుండా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అమలాపురంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వినుకొండ రాజారావు అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ శాఖల్లో భరోసా కల్పించి ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో దాదాపుగా 2.70 లక్షల మందికి సరాసరి ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లించే విధంగా చేసి, థర్డ్ పార్టీ అనేది లేకుండా రూపుమాపారని కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ సమగ్ర రక్షిత నీటి పథకాల ద్వారా ప్రజలకు మంచినీరు అందించడంలో నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి జనవరి 6న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సూన బోయిన మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు పోశయ్య, కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్, సింహాద్రి, బుజ్జి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, చిన్ని, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

సంప్రదాయ క్రీడల ప్రోత్సాహమే లక్ష్యం

కె.గంగవరం: ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందించిన క్రీడా సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సంస్కరణల దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ నెల 15 నుంచి 23 వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. యువత ఇందులో విజయం సాధించి, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం కొంతసేపు ప్రజాప్రతినిధులతో షటిల్ ఆడారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రవ్వ కార్మికుల ధర్నా



తెలుపుతున్న కార్మికులు

ఉప్పలగుప్తం: ఎస్.యానంలోని వేదాంత ఆయిల్ కంపెనీలో కార్మికులకు ఉపాధి, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతూ గేటు ముందు ధర్నాకు దిగారు. తహసీల్దార్ వెంకటేశ్వరి, రూరల్ సీఐ వీరబాబు, రవ్వ ప్లాంట్ అధికారి సోమందేవ్ సతీష్ కార్మికులతో చర్చలు జరిపారు. ఆర్డీఓ హామీ ఇచ్చేంతవరకు ఆందోళన కొనసాగుతుందని కార్మికులు తెలిపారు. ఎంపీటీసీ అప్పారావు, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

సుధకు ఎమ్మెల్యే పర్వత పరామర్శ



సుధను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పూర్ణ చంద్రప్రసాద్

అమలాపురం టౌన్: పితృ వియోగంతో బాధపడుతున్న అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయక కార్యదర్శి సుంకర సుధను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ సోమవారం పరామర్శించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో గల సుధ ఇంటికి ఎమ్మెల్యే వచ్చి సానుభూతి తెలిపారు. సుధ తండ్రి దివంగత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధ తల్లి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ పార్వతిని కూడా పలువురు పరామర్శించారు.

రచయిత్రి సుధకు తెలుగు వెలుగు పురస్కారం



రచయిత్రి సుధను సత్కరిస్తున్న సాహితీ వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: రచయిత్రి పచ్చిగోళ్ల సుధకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఈ పురస్కారాన్ని సుధకు ఆదివారం రాత్రి ప్రదానం చేసింది. ఈ విషయాన్ని రచయిత్రి సుధ అమలాపురంలో సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పేరూరులో వై ఏపీ నీడ్స్ జగన్



పేరూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్: పేరూరు సచివాలయం -3 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ దాసరి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సచివాలయ పరిధిలో 851 కుటుంబాల్లో 792 కుటుంబాలు లబ్ధి పొందాయి. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా మొత్తం రూ.14,02,13,819 అందించామన్నారు. సంక్షేమ బోర్డును ఆమె ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బి రామ్, వాసంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ దాసరి డేవిడ్, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు మొటూరి సత్తిబాబు, అమ్ము శ్రీను, ముత్తాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషా ఉత్సవ్

యానాం: మహాకవి సుబ్రహ్మణ్యభారతి జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక నవోదయ విద్యాలయంలో భారతీయ భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ రచయితగా, కవిగా, పాత్రికేయుడిగా, సంఘసంస్కర్తగా, సుబ్రహ్మణ్యభారతి చేసిన సేవలను తెలిపారు. భారతీయ భాషల పట్ల ఆసక్తి, నేర్చుకోవాలనే తపన, తద్వారా భాషాసంస్కృతి పట్ల గౌరవం పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం వివిధ కవుల రచనలతో కవిసమ్మేళనం, భారతీయ భాషల ప్రాముఖ్యతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, సుమారు 120 కవుల జీవితచరిత్రలతో కూడిన చిత్రపటాలను ప్రదర్శించారు. 22 భారతీయ అధికారభాషలు వాటి లిపి తదితరమైన వాటిని ప్రదర్శించారు. అంతకుముందు సుబ్రహ్మణ్యభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బేగం పాల్గొన్నారు.

అన్ని భాషలను గౌరవించాలి



సుబ్రహ్మణ్య భారతికి నివాళులర్పిస్తున్న డీఈవో కమలకుమారి, అధికారులు

అమలాపురం టౌన్: దేశంలోని అన్ని భాషలను అందరం గౌరవించినప్పుడు దేశ భాషకు విలువ పెరుగుతుందని డీఈవో ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి భారతీయ భాషా దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సభలో డీఈవో కమలకుమారి భాషలు– ప్రాధాన్యం గురించి మాట్లాడారు. జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, అమలాపురం ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పి.శాంతకుమారి మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల భాషలను మనమంతా గౌరవించాలని సూచించారు. ఉపాధ్యాయుడు ఎంఎస్ఎన్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన జయంతిని ఘనంగా జరిపారు.